
కార్తీక మాసం

నవంబర్ 2022

# గురువాణి

శ్రీవిద్యా జ్ఞాన పీఠం ఆధ్యాత్మిక మాస పత్రిక



ధన ప్రాప్తి, ఋణ బాధల నివారణ కోసం

**కుబేర పాశుపతం**

పిల్లల్లో మాటలు ఆలస్యం అవుతున్నాయా?

**నివారణోపాయములు**

## భగవంతుడు సర్వాంతర్యామి అయినప్పుడు దేవాలయాలకు ఎందుకు వెళ్ళాలి?



# శ్రీ రాజశ్యామలా ధ్యానం

శ్యామే సంగీత మాతః పరశివ నిలయే ముఖ్య సాచివ్య భారో
ద్వాహే దక్ష దయా పూరిత నిజ హృదయే మామకీం దైన్యవృత్తిం
శ్రీమత్ సింహాసనేశ్యామ్ భవవాన్ పతితాన్ దావద్ దగ్ధాన్ నమస్తే
త్రాతుం పీయూష వర్షైః కథయ పరికరం బద్ధవత్యామ్ వివిక్తే

# గురువాణి

## విషయ సూచిక

**గురువాణి ఆధ్యాత్మిక మాస పత్రిక**
సంపుటి -1 సంచిక - 3, నవంబర్ 2022

**గురువాణి** డిజిటల్ తెలుగు మాస పత్రిక, శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్ వారిచే ముద్రించబడినది.

గురువాణి సమాచార పత్రిక ను అందరికీ షేర్ చేయడం, యూ ట్యూబ్ ఛానల్ మరియు ఫేస్ బుక్ పేజి లలో చేరడం ద్వారా పీఠం యొక్క కార్యక్రమాలలో మీరు భాగస్వాములు కావచ్చును.

Subscribe Newsletter | Follow on Facebook | Subscribe YouTube

©Srividya Learning Centre

**శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్**
(సౌందర్య లహరి యొక్క ఒక విభాగము)

#69, 6th Cross Street, Girinagar Phase I,
Bengaluru, K A 560085, India.

srimeru999@gmail.com

+91 8088256632

www.srimeru.org

**ఈ సంచికలో** | **పేజీ**

**కవర్ పేజీ చిత్రము**
అమెరికా టెక్సాస్ రాష్ట్రంలో గురూజీ ప్రసంగం

**ధ్యానం**
శ్రీ రాజశ్యామలా ధ్యానం 02

**గురువాణి**
ఆలయాలకు ఎందుకు వెళ్లాలి 04

**శ్రీవిద్యా సాధన**
కుబేర పాశుపతం 06

**నివారణోపాయములు**
చిన్నపిల్లలో మాటలు రావడానికి పరిష్కారం 09

**శ్రీవిద్యా మందిరాలు**
కంచి కామాక్షి ఆలయం(రెండవ భాగం) 11

**జరిగిన కార్యక్రమాలు** 13

**రాబోయే కార్యక్రమాలు** 14

**సాధకుల అనుభవాలు** 15

**ప్రశ్నలు – సమాధానములు** 18



## గురువాణి

గురూజీ సందేశము

గురూజీ ప్రవచనాల నుండి

# భగవంతుడు సర్వాంతర్యామి అయినప్పుడు దేవాలయాలకు ఎందుకు వెళ్ళాలి?

### శ్రీ గురు కరుణామయ

సర్వాంతర్యామి, సర్వం ఖల్విదం (బ్రహ్మ, ఇందుగలడు అందులేడని సందేహము లేదు ఎందెందు వెదికిన అందందే గలడు చక్రి సర్వోపగతుండు" ఇవన్నీ విన్నాం. కానీ కలియుగంలో ముఖ్యంగా ఇవన్నీ ఆచరణలో పెట్టడం చాలా కష్టం. అనుభవంలోకి రావడం ఇంకా కష్టం. అందువల్ల సర్వాంతర్యామిని అందరిలో దర్శించగలగటం కష్టమైన పని. భగవంతుడిని మన పిల్లల్లో చూడాలి, భార్యలో చూడాలి, భర్తలో చూడాలి. పని మనిషిలో, ఆటో నడిపే వ్యక్తిలో....ఇలా అందరిలో చూడగలగాలి. అలా చూడ గలిగినప్పుడు నిజంగా దేవాలయానికి వెళ్ళవలసిన అవసరం లేదు. క్షేత దర్శనం అసలే అవనరం లేదు. కానీ మనం ఈ మాయలో పడి కొట్టుకుంటున్నాము కదా!

చండీ పాఠంలో "జ్ఞానినామపి చేతాంసి దేవీ భగవతీ హిసా బలదాకృష్య మోహయ, మహామాయా ప్రయచ్ఛతి" అని చెప్పబడింది. జ్ఞానులు, మహా మహా మునులు కూడా ఈ మహా మాయలో పడి కొట్టుకుంటుంటే, ఆవిడ చూస్తూ ఆనందిస్తుంది. ఇది ఆవిడ ఆడే జగన్నాటకం. అందుచేత ఈ దైనందిన జీవితంలో అనేక రకాలుగా తామసిక శక్తిలో మునిగి తేలుతూ ఉంటాము. ఎవరిమీద అయినా కోపగించుకున్నప్పుడు అది తామసికం. దానివల్ల ఆధ్యాత్మిక పురోగమనం, తరువాత ప్రాపంచిక పురోగమనం ఇవన్నీ కూడా తగ్గుతూ ఉంటాయి. కనుక ప్రతి ఒక్కరూ సాత్విక శక్తిని పునరుద్ధరణ చేసుకోవాలి.

ఎవరి మీదన్నా అరిచి కోపం ప్రదర్శించినప్పుడు సాత్విక శక్తి అంతా క్షీణించి బ్యాటరీ అయిపోయినట్లు అయిపోతుంది. అలాంటప్పుడు మళ్ళీ మనము రీఛార్జి చేసుకోవడానికి ఒక చోటికి వెళ్ళాలి. ఆ రీఛార్జి చేసుకునే ప్రదేశమే దేవాలయము, క్షేత్రము, పీఠము మొదలైన ప్రదేశాలు. ఎందుకు అక్కడ రీఛార్జి అవ్వగలవు? అంటే అక్కడ వేరే చింతన లేదు. పొద్దున్న లేస్తే ఆ పూజారిగారు ఎప్పుడూ పూజ లోనే ఉంటారు. త్రికాల పూజలు చేస్తారు, నైవేద్యాలు పెడుతూ ఉంటారు, భగవన్నామ ఘోష వినపడుతూ ఉంటుంది. అందరూ "ఏడుకొండల వాడా! వెంకటరమణా! గోవిందా గోవిందా!" అంటూవుంటారు..

# గురువాణి

## గురూజీ సందేశము

ఇదంతా కూడా వాయు మండలంలో సగుణాత్మకమైన శక్తిగా నిక్షిప్తం అయి ఉంటుంది. ఆ ఆధ్యాత్మిక శక్తిలో అందరూ కూడా తడిసి, ముద్దవుతారు. కానీ అక్కడికి వెళ్ళినవాళ్ళకి అందరికీ ఆ శక్తి వస్తుందా? దేవాలయానికి వెళ్ళినప్పుడు పాటించవలసిన నియమాలను పద్ధతి ప్రకారం ఆచరిస్తూ, సక్రమంగా దేవాలయ దర్శనం చేసుకున్నవాళ్ళకి అందరికీ దానికి తగిన ఫలితం ఉంటుంది. ఇంక ఇతర చింతనలేమీ ఉండకూడదు.

సంసారాన్ని దేవాలయాల దగ్గరకి పట్టుకురాకుండా, దైవ చింతన పైన ధ్యాస ఉంచటం వల్ల ఫలితం ఎక్కువగా లభిస్తుంది. మీరు జీవుడుగా పుట్టేరు, మీరు ఎవరో తెలుసుకోవాలి అనుకుంటున్నారు, అందుకోసం మీరు దేవాలయానికి వెళ్ళండి. ఇతర చింతన లేకుండా ఆ దేవాలయంలో ప్రదక్షిణ చేసుకుని, తరువాత అక్కడే కూర్చుని జపం చేసుకుంటే, లేదా నామస్మరణ చేసుకుంటే అక్షర లక్షలు అవ్వడానికి కూడా అవకాశం ఉన్నది.

ఇలా చేసుకున్నప్పటికీ, వాళ్ళకి మళ్ళీ ఇంటికి వచ్చాక ప్రాపంచికం తప్పదు. అందరూ ప్రాపంచికం వదిలేసి హిమాలయాల్లోకి వెళ్ళిపోలేరు కదా! ఈ సంపాదించుకున్న శక్తిలో కించిత్ శక్తి సంసారం కోసం వినియోగిస్తూ జీవనం సాగించవచ్చును. డబ్బు దాచుకోవడం అందరికి తెలుసు. కానీ ఈ ఆధ్యాత్మిక శక్తిని 'పెంచుకోవడానికి దేవాలయానికి వెళ్లడం శ్రేష్ఠం.

పీఠానికి, దేవాలయానికి భేదము ఏమిటంటే, దేవాలయానికి మీరు వెళ్లినప్పుడు, పూజారిగారు (బ్రహ్మగారు) చేసే పూజను మీరు చూస్తూ ఆనందిస్తారు. అక్కడ కూడా మీకు ఎలా ఉండాలి అని చెప్పేవాళ్ళు చాలా అరుదు. మీరు అటూ ఇటూ చూసుకుంటూ మాట్లాడుకుంటూ ఉంటారు. పూజ పూర్తి అయిన తరువాత ప్రసాదాలు తీసుకుని వచ్చేస్తారు.

కానీ పీఠంలో అలా కాదు. పీఠంలో ఒక వ్యక్తి ఉంటారు. వారే "గురువు". గురువు దగ్గర వేరే ధ్యాస ఉండదు. తల్లి, తండ్రి, భర్త, భార్య, చెల్లి, అక్క అన్న తమ్ముడు, కొడుకు, కూతురు అన్నీ కూడా గురువే. ఆ గురువే నీయొక్క జీవన బాధ్యతని కూడా తీసుకుంటాడు. సదా వేయి కళ్ళతో నిన్ను కాపాడుతూ ఉంటాడు. ఆ గురువు స్త్రీ అయినా, పురుషుడైనా, నిన్ను శిష్యునిగా స్వీకరించి నీకు మార్గదర్శనం చేస్తాడు. పీఠంలో కూడా, మూడు పూటలా (త్రికాల) పూజలు జరుగుతాయి. కానీ గురువు "నీవు ఇలా నడుచుకోవాలి, ఇలా చేయకూడదు. రోజూ ఉదయాన్నే లేవాలి. లేకపోతే మళ్ళీ ఫలితం లభించదు!" అని చనువుగా నిన్ను మందలించి, సరి అయిన దారిలో పెడుతుంటారు. గురువు ప్రతి ఒక్కరిని గమనిస్తుంటారు. అందువల్ల పీఠ దర్శనం శ్రేష్టము.

చంద్రశేఖర సరస్వతి స్వామి వారి కంచి కామకోటి పీఠం ఉంది. వారిని "నడిచే దేవుడు" అన్నారు. అలాంటి పీఠాలకి వెళ్ళినప్పుడు, అక్కడ గురువు ఉన్నా, లేకపోయినా, ఆయన తపశ్శక్తి వల్ల, మార్గదర్శనం, రక్షణ అంతర్లీనంగా లభిస్తుంది. అందువల్లదేవాలయానికైనా, పీఠాలకైనా ఎక్కడికో ఒక చోటకి నెలకొకసారి, కనీసం సంవత్సరానికి ఒకసారి క్షేత్ర దర్శనం చేసుకున్నట్లుగా వెళ్లి వస్తూ ఉండాలి. పీఠానికి వెళ్లినప్పుడు ఆ పీఠం యొక్క అభివృద్ధికి నేను ఏ రకముగా దోహద పడగలను? అని ఆలోచించాలి. ఉన్నవాళ్ళు ధన సహాయం చేస్తారు, లేని వాళ్ళు శ్రమ సహాయం చేస్తారు. నేర్చుకున్న ఆ విద్యను పదిమందికి పంచాలి.ఇది ఒక జ్ఞాన యజ్ఞం అంటారు. ఆ జ్ఞాన యజ్ఞంలో పాల్గొనాలి. "సర్వమూ వ్యాపించిన బ్రహ్మ పదార్థమే నువ్వు" అని చెప్పేటటువంటిది పీఠం. "నువు ఫలానా, నువు ఇది చేస్తే ఈ ఫలితం వస్తుంది" అని హద్దుల్లో పడేసేది దేవాలయం. అందుచేత దేవాలయం కన్నా కూడా పీఠమే శ్రేష్ఠం. ఏ పీఠంలో అయితే ధర్మ సంస్థాపన జరుగుతుందో, ఏ పీఠం లో అయితే శాస్త్ర పరంగా పూజలు అన్నీ నిస్వార్థంగా చేస్తారో ఆ పీఠ దర్శనం, ఆ గురువు దర్శనం అన్నిటి కంటే శ్రేష్టం.

Guru Karunamaya

# కుబేర పాశుపతం



**ఆర్థిక పరమైన ఇబ్బందులు, అప్పుల బాధనుండి విముక్తి పొందటానికి శక్తివంతమైన పూజా విధానము "కుబేర పాశుపత సంపుటీకరణం."**

**ఈ సంపుటీకరణం చేసిన వారి ఆర్థిక పరమైన లక్ష్యాలలోని ఆటంకాలు తొలగిపోయి, ఆర్థికంగా ఉన్నత స్థితిని పొందుతారు.**

ఉద్యోగ సమస్య, పెళ్లి కాకపోవడం, పిల్లలు పుట్టకపోవడం వంటి సమస్యలకు ఈ సంపుటీకరణం ఉపయోగపడుతుంది. కుబేర పాశుపత సంపుటీకరణం రుద్ర నమకం లోని అనువాకము తో చెప్పాలి.

విష్ణుమూర్తి చేతిలోని చక్రము, ఇంద్రుని చేతిలోని వజ్రాయుధముల వలెనే శివుని చేతిలోనిదే పాశుతాస్త్రము.

శివుని వద్ద ఉన్న అనేక పాశుపతములు, ప్రాపంచికములైన సమస్యలను తొలగించి ఆధ్యాత్మిక సాధనలో ముందుకు వెళ్లేందుకు శక్తివంతమైన పరిష్కారములుగా ఉపయోగించవచ్చును. వానిలో "కుబేర పాశుపతం" అనేది, ఆర్థిక పరమైన ఇబ్బందులను తొలగించటానికి శక్తివంతమైన పాశుపతం. ఈ పాశుపతాన్ని రుద్ర నమక చమకాలలోని అనువాకాలకు ముందు వెనుక చేర్చి సంపుటీకరణం చేస్తారు.

**ఈ పూజా విధి చేయవలసిన పద్ధతి:**

- గురుధ్యానం
- గణపతి ధ్యానం
- ఆచమనం
- ప్రాణాయామం
- సంకల్పం

తరువాత షోడశోపచార పూజను చేయాలి. ఈ షోడశోపచార పూజలో భాగంగా, కొబ్బరి నీళ్లు, ఆవు నెయ్యి, తెల్లని పుష్పాలతో శివలింగానికి అభిషేకం చేయాలి. దానిమ్మ గింజలను నైవేద్యంగా సమర్పించాలి.(ఈ విధానమంతా గత సంచికలో తెలియజేయబడింది).

ఈ విధంగా, ఒకే స్థలంలో ఒకే సమయంలో 41 రోజులు చేయాలి. సాధారణంగా ఈ పూజ సూర్యాస్తమయం ముందు సమయంలో చేయాలి.

**సూచన:**
రుద్ర నమకంలోని ప్రతి అనువాకానికి ముందు, వెనుక కుబేర పాశుపతాన్ని పఠించాలి. చమకంలో మాత్రం మొత్తం చమకం ముందు ఒకసారి, తరువాత ఒకసారి కుబేర పాశుపతాన్ని చదవాలి.

## నమకం పద్ధతి

ఓం రాజాధిరాజాయ ప్రసహ్య సాహినే నమో వయం వైశ్రవణాయ కుర్మహే
స మే కామం కామాయ మహ్యం కామేశ్వరో వైశ్రవణో దధాతు
కుబేరాయ వైశ్రవణాయ మహా రాజాయ నమః
ఓం నమో యక్షాయ కుబేరాయ వైశ్వానరాయ ధనధన్యాధిపతయే ధనధాన్య సమృద్ధిం మే
దేహి ధాపాయ స్వాహా

**ఓం నమస్తే రుద్రమన్యవ ఉతోత ఇషవే నమః**
**నమస్తే అస్తు ధన్వనే బాహుభ్యాముత తే నమః**

**యాత ఇషుః శివతమా శివం బభూవ తే ధనుః**
**శివా శరవ్యా యా తవ తయా నో రుద్ర మృడయా**
**----**
**----**
**నమస్తే అస్త్వాయుధాయానాతతాయ ధృష్ణవే**
**ఉభాభ్యాముత తే నమో బాహుభ్యాం తవ ధన్వనే**

**పరి తే ధన్వనో హేతిరస్మాన్వృణక్తు విశ్వతః**
**అథో య ఇషుధిస్తవారే అస్మన్నిధేహి తం**

**హస్తే దిక్ష్విషవ ఉభాభ్యాం ద్వావిగ్ంశతిశ్చ**

ఓం రాజాధిరాజాయ ప్రసహ్య సాహినే నమో వయం వైశ్రవణాయ కుర్మహే
స మే కామం కామాయ మహ్యం కామేశ్వరో వైశ్రవణో దధాతు
కుబేరాయ వైశ్రవణాయ మహా రాజాయ నమః
ఓం నమో యక్షాయ కుబేరాయ వైశ్వానరాయ ధనధన్యాధిపతయే ధనధాన్య సమృద్ధిం మే
దేహి ధాపాయ స్వాహా

## చమకం పద్ధతి

**మొదటి అనువాకం ఉదాహరణ:**

ఓం రాజాధిరాజాయ ప్రసహ్య సాహినే నమో వయం వైశ్రవణాయ కూర్మహే
స మే కామం కామాయ మహ్యాం కామేశ్వరో వైశ్రవణో దధాతు
కుబేరాయ వైశ్రవణాయ మహా రాజాయ నమః
ఓం నమో యక్షాయ కుబేరాయ వైశ్వానరాయ ధనధన్యాధిపతయే ధనధాన్య సమృద్ధిం మే
దేహి ధాపాయ స్వాహా

**ఓం అగ్నా విష్ణో సజోషసే మావర్ధందు వాం గిరః । ద్యుమ్నైర్వాజేభిరాగతం । వాజశ్చమే ప్రసవశ్చమే ప్రయతిశ్చ మే ప్రసితిశ్చ మే ధీతిశ్చమే క్రతుశ్చ మే స్వరశ్చ మే శ్లోకశ్చ మే శ్రావస్చ  శ్రుతిశ్చ మే జ్యోతిశ్చ మే సువశ్చ మే ప్రాణశ్చ మేఽ పానశ్చ మే వ్యానశ్చ మేఽ సుశ్చ మే చిత్తం చమ ఆధీతం చమే వాక్చ మే మనశ్చమే చక్షుశ్చ మే శ్రోత్రంచ మే దక్షశ్చ మే బలంచ మ ఓజశ్చ మే సహశ్చ మ ఆయుశ్చ మే జరాచ మ ఆత్మాచ మే తనూశ్చ మే శర్మచ మే వర్మచ మేఽంగానిచ మే స్థానిచ మే పరూ    షిచ మే శరీరాణిచ మే ॥ 1 ॥**

**----**

**----**

**ఓం ఇడా దేవహూర్- మనుర్-యజ్ఞనీర్-బృహస్పతిరుక్థామదాని శగ్ంసిష్తద్- విశ్వే దేవాః సూక్తవాచః పృథివి మాతర్మా మా హిగ్ంసీర్- మధు మనిష్యే మధు జనిష్యే మధు వక్ష్యామి మధు వదిష్యామి మధుమతీం దేవేభ్యో వాచముద్యాసగ్ం  శుశ్రూషేణ్యాం మనుష్యేభ్యస్తం మా దేవా అవంతు శోభాయై పితరోఽనువదంతు ॥**

ఓం రాజాధిరాజాయ ప్రసహ్య సాహినే నమో వయం వైశ్రవణాయ కూర్మహే
స మే కామం కామాయ మహ్యాం కామేశ్వరో వైశ్రవణో దధాతు
కుబేరాయ వైశ్రవణాయ మహా రాజాయ నమః
ఓం నమో యక్షాయ కుబేరాయ వైశ్వానరాయ ధనధన్యాధిపతయే ధనధాన్య సమృద్ధిం మే
దేహి ధాపాయ స్వాహా

ఇదే విధముగా రుద్రనమకములోని అన్ని అనువాకములను పఠించవలెను.

కుబేర పాశుపత సంపుటీకరణ విధానము గురించి Srimeru.org website నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చును.

# చిన్న పిల్లలకు మాటలు రావడానికి మరియు మాట్లాడటంలో ఉండే సమస్యలు పోవడానికి పరిష్కారం




యోగశాస్త్రమునననుసరించి, మెదడు నుండి వచ్చే సూచనల రూపంలో శివుడు బయలుదేరి, కుండలినీ ప్రాంతం(వెన్నెముక క్రింది భాగం) నుండి వచ్చే శక్తి రూపంలో అమ్మవారు బయలు దేరి, ఈ శివశక్తులు ఇద్దరూ స్వరపేటికలో సంయోజం చెంది, ధ్వని అనే ఒక శిశువును ఉత్పత్తి చేస్తారని భావిస్తారు. కనుక, మాట్లాడటానికి సంబంధించిన సమస్యలు తగ్గిపోవడానికి, మెదడులోని కణాలను ఉత్తేజపరచడమే సరైన మార్గము. కొన్ని ప్రత్యేకమైన మంత్రాలను ఎక్కువ సార్లు చెప్పడం ద్వారా ఈ సమస్యలను తగ్గించవచ్చును. సమస్య తీవ్రతను బట్టి, ఒక మంత్రము లేదా ఎక్కువ మంత్రాలను పఠించవలసి ఉంటుంది.

మేధా సూక్తము పఠిస్తూ లేదా వింటూ, పిల్లవానికి ఆవుపాలతో అభిషేకం చేయించాలి.

ఒక వెండి కలశంలో ఆవు పాలను తీసుకుని, పిల్లవాని శిరస్సు మీద సన్నని ధారగా పడేటట్లు పోయాలి. ఆ పాల ధార యొక్క పీడన శక్తి పిల్లవాని శిరస్సు మీద ప్రయోగింపబడాలి. ఇలా పోసేటప్పుడు మేధా సూక్తమును 5 నుండి 8 సార్లు మీ సౌలభ్యాన్ని అనుసరించి) చదవాలి. కంఠతా రాకపోతే, ఆడియో ఫైల్ ప్లే చేసి, పిల్లవాడు వింటూ ఉండగా పైన చెప్పిన విధానం అనుసరించాలి.

**మేధా సూక్తం ఆడియో లింక్**

పిల్లవానికి సమస్యలో కొంత తగ్గుదల కనపడేవరకు ఇదే విధానాన్ని ప్రతి రోజూ పాటించాలి. ఇంకా వంట ఇంటిలో వంట చేసేటప్పుడు, పిల్లవాడు భోజనం చేసేటప్పుడు కూడా ఈ ఆడియో ప్లే చేసి, పిల్లవాడు వినేటట్లు చేయాలి. దీనివలన ఇంకొంత మంచి ఫలితం ఉంటుంది.




**స్వరపేటికను ఉత్తేజపరచుట**

పిల్లవాని తల్లి తన కుడి చేతి ఉంగరం మరియు మధ్యవేళ్లతో పిల్లవాని స్వరపేటిక స్థానంలో తాకుతూ క్రింద ఇవ్వబడిన ఆడియో ఫైల్ ను ప్లే చేసి, పిల్లవానికి వినిపించాలి. ఈ ఆడియో ఫైల్ ను కనీసం 16 సార్లు ప్లే చేయాలి. ఆడియో ఫైల్ కారణంగా వాయు మండలంలో ఏర్పడిన శక్తి తల్లి యొక్క వేళ్ల స్పర్శ ద్వారా పిల్లవాని శరీరంలోని స్వరపేటికకు చేరి, ఆ స్వరపేటిక ఉత్తేజితం అవుతుంది. సమస్య తగ్గేంతవరకూ ఈ విధానాన్ని ప్రతి రోజూ చేయాలి.

**స్వరపేటికను ఉత్తేజ పరచుటకు మంత్రము**

**స్వరపేటికను ఉత్తేజ పరచుటకు మరియొక మంత్రము మరియు విధి**

మనం ఉత్పత్తి చేసే ధ్వని శక్తి ప్రారంభం అయ్యే స్థానములు ఎనిమిది ఉన్నాయి. మన శరీరంలో ఆ స్థానముల వివరం క్రింద ఇవ్వబడింది.

1. శిరస్సు పై భాగము
2. నుదురు మధ్య బాగము
3. భృకుటి (రెండు కనుబొమ్మల మధ్య భాగము)
4. మెడ భాగము
5. హృదయ భాగము
6. నాభీ భాగము
7. క్రింది పొట్ట భాగము
8. జననేంద్రియము లేదా వెన్నెముక క్రింది భాగము

పిల్లవాని తల్లి తన కుడి చేతితో ఈ భాగములను స్పృశిస్తూ క్రింది మంత్రమును 8 సార్లు చదువ వలెను.(2 మరియు 3 సంఖ్యలలో ఉన్న భాగములను ఉంగరం వేలితో స్పృశించవలెను). ఈ మంత్రమును వీలైనంత నెమ్మదిగా చదువవలెను.

**ఐం వద వద వాగ్వాదిని స్వాహా**

పైన వివరించిన విధానమును రోజూ మూడు సార్లు చేయవలెను. ఇలా, సమస్య తగ్గేంతవరకూ చేయవలెను.
మేధా సూక్తము మరియు ఇతర మంత్రములు Srimeru.org website నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చును.

పిల్లల సమస్యల పరిష్కారం గురించి తెలియజేసే వీడియో https://youtu.be/jGD74Pabx4g



# కంచి కామాక్షి ఆలయం

కంచి కామాక్షి (రెండవ భాగము) (అక్టోబర్ సంచిక తరువాయి)




గాయత్రీ మంటపం గర్భగృహంలో కామాక్షీ విగ్రహానికి కుడివైపున తపో కామాక్షి అమ్మవారు దర్శనం ఇస్తారు. కాత్యాయన ముని కుమార్తె అయిన కాత్యాయిని, శివునితో వివాహం చేసుకోవడం కోసం తపస్సు చేయ సంకల్పించి, కాంచీ పురం వచ్చినది. ఆమె తపస్సు చేసిన స్థలం లోని మామిడి వృక్షం ఏకాంబరేశ్వర మందిరంలో ఇప్పటికీ చూడవచ్చును.

సౌభాగ్య గణపతికి ఎదురుగా ఉన్న దేవత అరూపలక్ష్మి. ఆమె పక్కనే ఉత్తర దిక్కును చూస్తూ ఉన్న అమ్మవారు వారాహీ దేవత. శ్రీవిద్యా సాధనలో వారాహీ దేవత ఒక ముఖ్యమైన దేవత. ఈమె లలితా దేవి యొక్క సైన్యాధిపతి. వారాహీ దేవత తన భక్తులపై ఎవరైనా చేసే చెడు తంత్రాలను తిప్పికొడుతుంది. స్థల సంబంధమైన సమస్యలు లేదా కోర్టు వ్యవహారాలలో సమస్యలు ఉంటే వారాహీ దేవతను ప్రార్థించినా, ఆమె మంత్రాన్ని జపించినా, ఆ సమస్యలు తొలగిపోతాయి. ఇక్కడే అన్నపూర్ణా దేవి కూడా వేంచేసి ఉన్నది. అమ్మను భక్తిగా ఆరాధించిన వారికి జ్ఞానము, వలసినంత ఆహారము అమ్మ ఇస్తుంది.

గాయత్రీ మంటపం బయటకు వచ్చిన తరువాత, దూర్వాస మహాముని విగ్రహం దర్శనం ఇస్తుంది. రుద్రాంశ అయిన ఈ మహర్షిని క్రోధ భట్టారక అని కూడా పిలుస్తారు. ఈయన విపరీతమైన క్రోధంతో ఎప్పుడైనా శాపం ఇచ్చినప్పటికీ, అది ధర్మం నిలబెట్టడం కోసమో లేదా ఒక దైవిక కార్యం కోసమో అయి ఉంటుంది. కంచి కామాక్షీ మందిరంలో ఆచరించే "సౌభాగ్య చింతామణి" అనే పూజా విధానాన్ని అగస్త్య ముని ఏర్పరచారు.

దూర్వాస మహాముని విగ్రహం ఎడమ వైపు సాయన మంటపం ఉన్నది. అభిరామి భట్టు అనే గొప్ప భక్తుడు రచించిన



అభిరామి" అనే శ్లోకముల సంకలనం ఇక్కడి గోడల మీద వ్రాసి ఉండటం చూడవచ్చును. ఇంకొంచెం ముందుకు వెళితే, ఉత్సవ కామాక్షి విగ్రహం చూడవచ్చును. ఉత్సవ కామాక్షి ఎదురుగా కామాక్షీ అమ్మవారి భక్తుడైన తుందీర మహారాజు గారి విగ్రహం ఉన్నది. ఈ రెండు విగ్రహాల మధ్య నిలబడకూడదని చెబుతారు.

స్వర్ణ కామాక్షి పక్కనే ఎనిమిది చేతులతో ఉన్న రాజ శ్యామలా దేవి విగ్రహం ఉన్నది. రాజశ్యామలా దేవి, లలితా పరాభట్టారిక యొక్క మంత్రిణిగా ఉన్నారు. రాజశ్యామలా దేవి, వాక్కు, సంగీతము, కళలకు సంబంధించిన జ్ఞానానికి అధిదేవత.

ఇక్కడ గొప్ప విషయం ఏమిటంటే, ఒకే చోట మనం అయిదుగురు కామాక్షీ రూపములను దర్శించుకొనవచ్చును. మొదట ఎదురుగా ఉండే కామాక్షీ అమ్మవారి ముఖ్య స్వరూపం, తరువాత ఉత్సవ కామాక్షి, స్వర్ణ కామాక్షి(ఇక్కడ బంగారు పాదుకలు కంచి పరమాచార్యుల వారిచే ప్రతిష్ఠింపబడినవి), తపో కామాక్షి, మరియు మందిరం పై భాగంలో ఉన్న కామాక్షీ అమ్మవారు.

ఇక్కడ నుండి బయటకు రాగానే, ఆది శంకరాచార్యుల వారి దర్శనం లభిస్తుంది. ఇక్కడ మీకు ఇవ్వబడిన గురుమంత్రం పఠించాలి. లేదా

**గురుబ్రహ్మ గురుర్విష్ణుః**
**గురుర్దేవో మహేశ్వరః**
**గురు సాక్షాత్ పరబ్రహ్మ**
**తస్మైశ్రీ గురవేనమః**

అనే మంత్రమును పఠించాలి.

ఇక్కడికి బయట వైపు పెద్ద పుష్కరిణి ఉన్నది. ఇంకా ముందుకు నడిచి వెళితే, రెండవ, మూడవ మరియు నాల్గవ రాజ గోపురాలు దర్శనం ఇస్తాయి. ఈ మందిరంలో గోపూజ మరియు గజ పూజ ముఖ్యమైన ఘట్టాలు.

**ప్రయాణించటానికి కావలసిన వివరాలు:**

కాంచీపురం చేరటానికి, రోడ్డు, రైలు మరియు విమాన మార్గాలు అన్నీ అనుకూలంగానే ఉంటాయి. చెన్నై లోని అంతర్జాతీయ విమానాశ్రయం ఇక్కడి నుండి 64 కిలోమీటర్లు దూరం ఉంటుంది.

మందిరం సమయాలుః ఉదయం 5.30 నుండి 12.30 వరకు, సాయంత్రం 4.00 నుండి 8.30 వరకు ఉంటాయి. అన్ని శుక్రవారాలు పవిత్ర దినాలుగా పరిగణించబడతాయి కనుక ఆ రోజు మందిరం రాత్రి 9.30 వరకు తెరచి ఉంటుంది. పౌర్ణమి రోజుల్లో మందిరం రాత్రి 10.30 వరకు తెరచి ఉంటుంది.

# ఉత్సవాలు, కార్యక్రమాలు



## దుర్గా నవరాత్రులు, నిమజ్జనం

దేవీ నవరాత్రుల తరువాత దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమం నవంబరు 5వ తారీఖు కనకపురా లోని తరలు సరస్సులో మధ్యాహ్నం 12 గంటల సమయంలో జరిగింది.ముందు పీఠం వద్ద ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత, గురూజి, అమ్మాజీ మరియు అనేక మంది భక్తులు నిమజ్జన యాత్రలో పాల్గొని, భజనలు, నృత్యాలు చేశారు.

## సూర్య గ్రహణ జపం

అక్టోబరు 25వ తారీఖున రాజమండ్రిలోని గోదావరీ నదీ తీరంలో సరస్వతీ ఘాట్ వద్ద అనేక మంది భక్తులతో కలసి, గురూజీ జపం నిర్వహించారు. గ్రహణ పట్టు స్నానము విడుపు స్నానము అందరూ చేశారు.





## దీపావళి సంబరాలు

శ్రీ విద్యా జ్ఞాన పీఠంలో దీపావళి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా, గురూజీ, అమ్మాజీ , అందరికీ తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాబోయే కార్యక్రమాలు



## గురూజీ పర్యటన వివరాలు

నవంబర్ నెలలో గురూజీ ఈ క్రింది నగరాలకు పర్యటించనున్నారు. అప్పాయింట్ మెంట్ కొరకు +91 8088256632 నంబరుకు మెసేజ్ పంపగలరు.

**నవంబరు 15 నుండి 22వ** తారీఖు వరకు – హైదరాబాదు
**నవంబరు 28 నుండి డిసెంబర్ 6వ** తారీఖు వరకు – బిలాయ్, మధ్యప్రదేశ్ రాష్ట్రం,
**మిగిలిన రోజులు** – బెంగుళూరు

## కార్తీక మాసం కార్యక్రమాలు

బెంగుళూరు – ప్రతి సోమవారం నాడు పీఠమునందు ఏకాదశ రుద్రాభిషేకము నిర్వహించబడును.

కాశీ – గురూజీ, అమ్మాజీ మరియు 115 మంది శిష్యులు అందరూ అక్టోబరు 31 నుండి నవంబరు 9వ తారీఖు వరకు కాశీలో ఉంటున్నారు. కార్తీక పౌర్ణమి నవంబరు 8వ తారీఖు నాడు గంగానదీ తీరంలో జపం నిర్వహించబడుతుంది.





## శ్రీ విద్యా తరగతులు

శ్రీ విద్యా తరగతుల తేదీల వివరాలు
**ఇంగ్లీష్ మాడ్యూల్** 1&2 – **నవంబరు** 11,12 **మరియు** 13 తేదీలు, సాయంత్రం 5 గంటల నుండి 9 గంటల వరకు (భారతీయ కాలమానం ప్రకారం)
**తెలుగు మాడ్యూల్** 1&2 – **నవంబరు** 18,19 **మరియు** 20 తేదీలు, సాయంత్రం 5 గంటల నుండి 9 గంటల వరకు (భారతీయ కాలమానం ప్రకారం)
రిజిస్టర్ చేసుకోవడానికి ఈ క్రింద లింక్ ఇవ్వబడినది.
https://srimeru.org/srividya-saadhana

సంపుటి -1 సంచిక - 2

# గురూజీతో నా అనుభవాలు

## శ్రీమతి జ్యోతి రెడ్డి గారు



**శ్రీమాత్రేనమః**

గురూజీ తో నా ప్రయాణం 2016 వ సంవత్సరంలో ప్రారంభం అయింది. గురువు యొక్క ప్రాముఖ్యత అంతగా తెలియని కుటుంబంనుండి రావటం వలన, నాకు కూడా సరైన అవగాహన లేదు. కానీ, నేను అనుకున్నంత మాత్రాన అది జరిగిపోదు అని ఇప్పుడు నాకు తెలుస్తున్నది. నా ప్రయాణాన్ని నిర్ణయించేది ఆ జగన్మాతయే.

నా ఉద్యోగ వివరాలలోకి వెళితే, 23 సంవత్సరాల వయసులో చిన్నపిల్లలకు పాఠాలు చెప్పే టీచర్ గా నా కెరీర్ ప్రారంభించాను. అసలు అది కూడా నేను చేస్తానని అనుకోలేదు. కానీ అది కూడా అమ్మ ఆడిన ఆటేనని ఇప్పుడు అర్థం అవుతున్నది. నేను చేస్తున్న పనిలో ఏకాగ్రత చూపిస్తూ, నాకు చేతనైనంత గొప్పగా పిల్లలకు బోధిస్తున్నాను. ఇదే యోగం అని ఇప్పుడు అర్థం అవుతున్నది.

దీనివల్ల నేను చేసే ఉద్యోగంలో నాకు తృప్తి లభించింది.
స్కూల్ టీచర్ నుండి 15 సంవత్సరాల కృషి తదనంతరం అదే స్కూల్ కు ప్రిన్సిపాల్ బాధ్యతకు చేరుకుని, నేను పని చేస్తున్న స్కూలును ఒక ఆదర్శ విద్యాలయంగా చేయటానికి నా శాయశక్తులా కృషి చేశాను(గురూజీ చెప్పిన దాని ప్రకారం నీకున్నది వందశాతం ఇవ్వడమే యోగం).

అక్కడి నుండి కేవలం ఒక సంవత్సర కాలంలోనే నా బాధ్యత పెరిగి, 13 స్కూల్స్ కు జోనల్ హెడ్ గా నియమించబడ్డాను. ఇక్కడ కూడా, ఉత్తమ విద్యనందించడం కోసం నన్ను నేను అంకితం చేసుకోవడమే నాకు పై స్థాయికి చేరుకోవడానికి దోహదపడింది.

దీనితో పాటు నా వ్యక్తిగత జీవితంలో...

నాకు కావలసినవి అన్నీ అడగకముందే నాకు లభించాయి. ఇప్పటికీ నా సాంసారిక జీవితం సంతోషంగా గడిచిపోవడానికి నాకు ఏమి కావాలో దానిని నేను వెతుకుతున్నాను. నన్ను ప్రేమించే భర్త, ఇద్దరు పిల్లలు, నాకు అన్ని విషయాలలో చేదోడు వాదోడుగా ఉండే నా కుటుంబం మరియు మిత్రులను నేను పొందాను.

జోనల్ హెడ్ గా 5 సంవత్సరాలు పని చేసిన తరువాత, ఆ బాధ్యతకు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాను. దానికి ప్రత్యేకమైన కారణం ఏమీ లేదు. కేవలం అమ్మ నన్ను పిలవటం వల్లనే అలా జరిగింది అని అనుకుంటున్నాను.

అప్పుడు నా మిత్రులలో ఒకరు, నూతన సంవత్సర కానుక అని చెబుతూ, నన్ను సౌందర్య లహరి గ్రూప్ లో చేర్చారు. ఆ విధంగా నా శ్రీవిద్య ప్రారంభం అయింది. నాకు ఖాళీ ఉన్న సమయంలో గురూజీ చెప్పిన ప్రవచనాలు వింటూ ఉన్నాను. ఏదో ఒక సందర్భంలో గురూజీ ప్రవచనాలు నన్ను వారి వైపుకు ఆకర్షించాయి. ఒక మంచిరోజున గురూజీ దగ్గర అప్పాయింట్ మెంట్ తీసుకుని, వారిని కలవటానికి వెళ్లాను.

శ్రీరామనవమి రోజున, హైదరాబాద్ లో, గురూజీ శిష్యులలో ఒకరి ఇంటి వద్ద గురూజీని కలవడానికి వెళ్లాను. అక్కడ చాలామంది శిష్యులు శ్రీ యంత్రం అలంకరణలో హడావిడిగా ఉన్నారు. అక్కడ, ఎవరికైనా శ్రీ యంత్రం కావాలా అని అడిగారు. కొన్ని రోజుల క్రితం 84 శ్రీ యంత్రముల ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగిన తరువాత, అమ్మవారిని తీసుకువెళ్లడానికి రావలసిన వారిలో ఒకరు రాలేదు. కనుక ఆ యంత్రం ఇంకెవరికైనా కావాలా అని గురూజీ అడిగారు.

అప్రయత్నంగా నేను నాకు కావాలి అని చెప్పాను. నిజానికి శ్రీ యంత్రం అంటే ఏమిటో నాకు తెలియదు. ఇంకెవరూ కావాలి అని చెప్పకపోవడం వలన, అమ్మ నాతో పాటు మా ఇంటికి విచ్చేసింది. ఆ విధంగా, గురువు మరియు అమ్మ ఇద్దరూ ఒకేసారి నా జీవితంలోకి ప్రవేశించారు.

తరువాత ఏమి చేయాలో, ఆ శ్రీయంత్రాన్ని ఎలా పూజించాలో, నాకు ఏమీ తెలియదు. మరునాడు గురూజీ మరొక శిష్యుని ఇంటికి వచ్చారు. నేను అక్కడికి వెళ్లాను. అక్కడ, గురూజీ నాకు, గణపతి మరియు బాలా మంత్ర దీక్ష ఇచ్చారు. నిర్ణయింపబడిన సమయం లోపు మంత్ర జపం పూర్తి చేయమని గురూజీ చెప్పారు.

అత్యంత శ్రద్ధతో నేను పూజ, జపం మొదలుపెట్టాను. అన్ని పనులూ చేసుకుంటూ, సౌందర్యలహరి సంస్థలో జరిగే కార్యక్రమాలలో పాల్గొనడం ప్రారంభించాను. అనుకోకుండా, నా జపం చేసే వేగం తగ్గి, సౌందర్యలహరి కార్యక్రమాల నిర్వహణలో ఎక్కువ సమయం వెచ్చించడం ప్రారంభించాను.

దీని గురించి నేను గురూజీని అడిగినప్పుడు, వ్యక్తిగత సాధన కంటే గురు సేవ ఎక్కువ శక్తి కలిగిన సాధన అని చెప్పారు. అక్కడి నుండి, గురూజీ ని సంప్రదిస్తూ, చైతన్యవంతమైన జీవితం ప్రారంభించాను. దానితోపాటు షోడశోపచార పూజా విధానము ద్వారా నా అనుమాలు ఇంకొన్ని తీరిపోయాయి.

శ్రీవిద్యను వ్యాప్తి జేయాలనే గురూజీ సత్సంకల్పము లో భాగంగా ఏమీ ఆశించకుండా నేను చేయగలిగిన సేవ నేను చేయడం ప్రారంభించాను. ఇది ఒక టీమ్ వర్క్ అయినప్పటికీ, చివరకు 2017 మే నెలలో, బెంగుళూరులో శ్రీ విద్యా జ్ఞాన పీఠం ప్రారంభం అయింది. అది కూడా ఒక అద్దె ఇంటిలో మాత్రమే ఏర్పాటు చేయబడి, ప్రస్తుతం విశ్వ వ్యాప్తంగా ఒక స్థాయిని చేరుకున్నది.

ఈ నా ప్రయాణం, నన్ను గొప్ప వ్యక్తిత్వం కలిగే విధంగా మార్చివేసింది. పూర్వంలో జాగరూకత తక్కువగా ఉన్న నా జీవితం ఇప్పుడు మారిపోయి, ఇప్పుడు విశాల దృక్పథంతో ముందుకు నడుస్తున్నది.

“ఫరవాలేదు” అనే ఒక పదంతో గురూజీ నాకు ఇచ్చిన మంత్రం నాలో చాలా మార్పులు తెచ్చింది. నేను అనే ఆలోచననుండి ఉన్నతంగా ఆలోచించాలనే గురూజీ ఆలోచన నన్ను ప్రేరేపించింది. అది కూడా నేను కాదు. నాలోని అమ్మయే. గురూజీ ఎప్పుడూ చెప్పే అద్వైత సిద్ధాంతం నా పైన ప్రభావం చూపించింది. “నీవు” మరియు “ప్రపంచం” అనే పదాలకు మధ్య తేడా లేదు అని చెప్పే మాటల వల్ల నేను ఇతర ప్రాణుల మీద సహానుభూతి చూపించే తత్వాన్ని అలవాటు చేసుకునే ప్రయత్నం ప్రారంభించాను. “గురువు” అనే పదానికి కేవలం “బోధకుడు” అని మాత్రమే కాకుండా, ఆ పదం వెనుక ఉన్న తత్వాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించాను.

ఎప్పుడూ పెద్ద పెద్ద ఆశలు పెట్టుకోవద్దని గురూజీ చెబుతూ ఉంటారు. దానివల్ల, ఏదైనా పని జరగనప్పుడు వచ్చే నిరాశా నిస్పృహల బాధలు నిన్ను బాధించవు అని గురూజీ చెబుతూ ఉంటారు.

చాలా సార్లు గురూజీ, అమ్మ గురించి, అమ్మ యొక్క లక్షణాల గురించి వివరించడం నేను గమనించాను. “నేనే అమ్మ, అమ్మే నేను” అనే భావనను పెంపొందించుకుంటూ, అవరోధాలు లేని, అవధులు లేని, విశ్వవ్యాప్తమైన, అపారమైన ప్రేమను అలవరచుకోవాలి.

చివరిగా, గురూజీ ద్వారా నేను అర్థం చేసుకున్నదేమిటంటే, అమ్మ పాదాలను శరణు వేడాలి. సర్వస్య శరణాగతిని పాటిస్తూ ముక్తి మార్గమునందు పయనించాలని చెప్పిన గురూజీ మాటలను గుర్తు చేసుకున్నప్పుడు, “గురువుకు,అమ్మకు తేడా లేదు” అని అర్థం చేసుకున్నాను.

అమ్మను శరణు వేడినప్పుడు జీవితంలో జరిగే సంఘటనలు అమ్మ ఆదేశం ద్వారానే జరుగుతున్నాయి అని మనకు అర్థం అవుతుంది. మనకు ఏది సరైనదో అమ్మకు తెలుసు. సంతోషం, దుఃఖం ఏదైనా కూడా అమ్మయే కల్పించి, తద్వారా మన కర్మలను కాల్చివేస్తుంది.

సర్వస్య శరణాగతి వలన మనకు ఉపశమనం లభిస్తుంది. వైద్యం చేసేటప్పుడు రోగికి ఇచ్చే మత్తు మందు లాగా అది పని చేస్తుంది.

మరొక విషయం నేను అర్థం చేసుకున్నది ఏమిటంటే, ఐహికమైన విషయాలమీద ఆశ ఎక్కువగా ఉండకుండా, స్తబ్దంగా నడస్తూ ఉండాలి. నష్టం వచ్చినప్పుడు కూడా అదే నిర్మలత్వంతో వ్యవహరించాలి. అంటే అవన్నీ కూడా అమ్మ చేసే పనులే. మనం నిమిత్త మాత్రులం అని అర్థం చేసుకోవాలి.

ఎప్పుడూ ఆనందంగా ఉండాలని గురూజీని చూసి నేను అర్థం చేసుకున్నాను. ఆ ఆనందానికి ఐహికమైన కారణాలు కారణం కారాదు. అంటే, “నాకు మంచి మార్కులు వచ్చాయి కనుక నేను ఆనందంగా ఉన్నాను. నాకు మంచి ఉద్యోగం వచ్చింది కనుక నేను ఆనందంగా ఉన్నాను” ఇలా ఉండకుండా, మంచి జరిగినా, చెడు జరిగినా ఒకే రకమైన ఆనంద స్థితిలో నేను ఉండగలగాలి.

“కానీ, ఐయితే, ఎందుకంటే” వంటి పదాలకు స్వస్తి చెప్పాలి. “సర్వానందమయ” అని అమ్మను కీర్తించినట్లుగానే, ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలి.

మన జీవితాలలో ఏమి జరిగినా దాని పట్ల కృతజ్ఞతా భావం కలిగి ఉండే తత్వాన్ని అలవరచుకోవాలని గురూజీ చెబుతూ ఉంటారు.

ఇదే శ్రీ విద్యతో కూడిన నా జీవితం. “మీవి ఎన్ని మాడ్యూల్స్ పూర్తి అయ్యాయి? గురూజీ మీకు పంచదశి మంత్ర దీక్ష ఇచ్చారా?” అని మిగిలిన వారు అడుగుతూ ఉంటారు. నేను వారికి చెప్పే సమాధానం ఏమిటంటే, “నాకు గురుమంత్రం ఉన్నది. అదే నాకు సర్వస్వం.” ఈ మహావిద్యలో నేను ఏమీ కావాలని కోరుకోలేదు. కానీ “గురు సాంగత్యం” అనగా వీలైనప్పుడల్లా గురువు దగ్గర ఉండడం అలవాటు చేసుకున్నాను. ఎందుకంటే, గురూజీ చెప్పే ప్రతి మాటా వేదంతో సమానం. ఆ చిన్న చిన్న మాటలను మూటలోకి ఏరుకుని, నా జీవితంలో వాటిని పాటించి, అందరికీ ఉపయోగపడే విధంగా నేను జీవించాలని మాత్రమే నేను కోరుకుంటాను.

సాధకుల కోసం, స్వంత ప్రాంగణంలో పీఠం ఏర్పరచాలనే గురూజీ కోరిక ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఈ పని, అందరూ కలసి సంయుక్తంగా చేయవలసినదని నేను అనుకుంటున్నాను. గురూజీ కన్న కలను నిజం చేయటానికి మనం, సాధకులమందరం కలసి ప్రయత్నం చేద్దాము.

**శ్రీమాత్రేనమః**

# పూర్వ సువాసినుల పట్ల సాంఘిక దురాచారం అవసరమా?



మనలో చాలామందికి, ఏదైనా పనిమీద వెళుతున్నప్పుడు, పూర్వ సువాసిని (వితంతువు) ఎదురు పడితే, అశుభం అన్న భావన ఉంది. చాలామంది అడగాలి అనుకున్నా భయంతో అడగలేని ప్రశ్న. ఒకవేళ ఈ నియమాన్ని పాటించకపోతే ఏమైనా పాపమేమో అనే పాపభీతి కూడా ఉంటుంది. ఈ పాప భీతి అన్నది కొన్ని విషయాల్లో మంచిదే కానీ, సమాజంలో ఒక వర్గాన్ని చిన్న చూపు చూడటం మాత్రం చాలా తప్పు. పుట్టినప్పుడు, అమ్మ దిష్టి చుక్క పెడుతుంది. అక్కడ్నించి కొంచెం పెద్దయ్యాక కుంకుమ బొట్టు, తిలకం ఇలా అన్నీ పెట్టుకుంటారు. నగలు వేసుకుంటారు. ఇంకా పండగలు వచ్చినప్పుడు పువ్వులు పెట్టుకుంటారు. ఇవన్నీ పెళ్లి అయ్యేముందు వచ్చినవే కదా!

పెళ్ళి అయిన తరువాత ఆ కొత్తగా వచ్చినవాడు తెచ్చిన సౌభాగ్యచిహ్నాలు కిందే వీటిని భావించి, “భర్త పోయిన తరువాత బొట్టు పెట్టుకోకూడదు, అసలు మెళ్ళో ఏమీ ఉండకూడదు, అలంకరించుకోకూడదు” అని అనడం ఎంతవరకు సమంజసం? తార్కికంగా మనం ఆలోచించుకోవాలి. అంతేకాదు, పూర్వపు రోజుల్లో (పురాణాల సమయంలో చెప్తున్నాను) ఆ వ్యవస్థ ఉన్నది అంటే, ఆ సమాజానికి అది సరిపోయింది. ఎందుకంటే, భర్త చనిపోయాక మగవాళ్లందరూ ఆవిడ్ని వేరే దృష్టితో చూస్తున్నారు కాబట్టి ఆ స్త్రీకి సమాజంలో రక్షణ కల్పించడానికి, అలాంటి పద్ధతి పెట్టి ఉండవచ్చు. అప్పుడు స్త్రీ అబల. రెండో క్లాస్, మూడో క్లాస్ కంటే ఎక్కువ చదువుకునేవారు కారు. ఆలా వున్న స్త్రీ నిరాధారం అయినప్పుడు, దాన్ని హేతువుగా చేసుకుని కొంతమంది వాళ్ళని వక్ర దృష్టితో చూడడం మొదలుపెట్టడం వలన, రక్షణ కల్పించడం కోసం అలా పెట్టి ఉండవచ్చును. ఎవరైనా బొట్టు పెట్టుకుంటే అందంగా కనపడతారు. ఒక నగ వేసుకుంటే అందంగా కనపడతారు. ఈవిడ అందంగా కనపడకపోతే రక్షణ ఉంటుంది - అన్న ఒక సిద్ధాంతంతో వాటిని తీసుకొచ్చినట్లు అనుకోవచ్చును. దీనికి కొంతవరకు మనం "సరే" అనాల్సిందే. ఎందుకంటే ఉద్దేశ్యం మంచిది కాబట్టి.

దేశ కాల పరిస్థితులను బట్టి ధర్మం మారుతుంది. ఇప్పటి సమాజం ఎలావుంది? అందరూ కంప్యూటర్ నేర్చుకుంటున్నారు, ఉద్యోగాలు చేస్తున్నారు. ఉద్యోగాలు చెయ్యని స్త్రీలు తక్కువ. స్త్రీలు అబలలు కారు, సబలలు అని చాలా సందర్భాలలో నిరూపించేరు. చంద్రమండలానికి కూడా వెళ్లిపోతున్నారు. అలాంటప్పుడు, ఇప్పుడు వున్న పరిస్థితులలో చూస్తే, అప్పుడు ఏర్పరిచిన ధర్మం ఎంత మాత్రము వర్తించదు. కృష్ణ భగవానులు కూడా భగవద్గీతలో, "మనోధర్మాన్ని పాటించు" అని చెప్పారు. "నేను ఈ సందర్భంలో ఏమి చెయ్యాలి?" అని ఆలోచించుకొని, అంతఃకరణ శుద్ధిగా ఏది చేస్తే, అదే ధర్మం.


రామాయణంలో రాములవారు చెట్టుచాటు నుండి వాలిని కొట్టేరు. అది నిజానికి క్షత్రియ ధర్మం కాదు. కానీ ఆ సమయంలో రాముల వారికి ఇంక వేరే దారి లేదు. అందువల్ల ఆలా చేశారు. ప్రస్తుత విషయంలోకి వస్తే, పూర్వ సువాసిని గురించి అసలు మానవతా దృష్టితో ఆలోచిస్తే, అసలే భర్తపోయి దుఃఖంలో ఉంటుంది, “సంసారాన్ని ఎలా నెట్టుకు రావాలి?” అనే ఆలోచనలో ఉంటుంది. భవిష్యత్తు అంతా ఒక్కసారిగా చీకటైపోతుంది. అలాంటప్పుడు మనిషన్నవాడెవడైనా సరే "నేనున్నాను నీకు ఏ సహాయం కావాలన్నా! దుఃఖపడకు, పోయిన వాళ్ళతో మనం పోలేము. మేమందరం వున్నాం, చక్కగా ఉంటుంది" అని అనునయించడం పోయి, ఈవిడ్ని పరామర్శ చేయడానికి మంగళవారం,

శుక్రవారం అయితే పనికిరాదనీ, తీరుబడి చేసుకుని, ఆవిడ ఇంకా ఈ యొక్క సందర్భానికి సర్దుకుని, దుఃఖాన్ని దిగమింగుకున్నపుడు, అప్పుడు గుంపుగా వచ్చి బుధవారంనాడు, "యెంత కష్టం వచ్చిందే తల్లి" అని ఆవిడ్ని కుదిపేసి మళ్ళి ఏడిపించటం,ఎంతవరకు సమంజసం అని ఆలోచించాలి.

ఇలాంటివి ఇంకా వున్నాయి. భర్త కానీ ఒక చెడు నక్షత్రంలో మరణిస్తే, ఆవిడ ముఖం చూడకూడదని, ఒక గదిలో పెట్టేసి మూడు రోజులవరకు ఆవిడను బయటకు రానివ్వరు. మామూలు ఒక కుక్కపిల్లకి (ఇలా అంటున్నాని ఏమి అనుకోవద్దండి, నేను చూసేను కాబట్టి బాధతో చెప్తున్నాను) పెట్టినట్లు, తలుపు కిందనించి అన్నం తోసేవారు. మూడోరోజు, అప్పుడు ఆవిడ్ని మళ్ళీ విడిపించేవారు. ఇలాంటి మానవత్వం లేని ఆచార వ్యవహారాలు మనకి వద్దు.

ఇంకొక విషయం ఏమిటంటే పరామర్శ చెయ్యడానికి వెళ్లేటప్పుడు, మెళ్ళో ఒక పసుపుతాడు మంగళసూత్రం పైన కట్టుకుంటారు, జీలకర్ర నోట్లో వేసుకుంటారు. "ఎందుకు?" అని అడిగినప్పుడు, వాళ్ళు “భర్తపోయిన స్త్రీలకు, నాకు భర్త పోయేడు, మీకందరికీ భర్తలు ఉన్నారు అనే అసూయ ఉంటుంది. ఆ అసూయవల్ల మా మంగళసూత్రం తెగిపోకుండా వుండటంకోసం కట్టుకున్నాం" అన్నారు. ఈ ఆలోచనే మానవత్వంతో కూడిన ఆలోచన కాదు. పైగా, మన కుటుంబంలో ఎవరికైనా అలాంటి దుస్థితి వచ్చినా కూడా, ఏమీ వెనకాడకుండా, ఇటువంటి ఘోరాన్ని చేస్తూ ఉంటాము.

మన ఇళ్లల్లో పెళ్లిళ్లు, శుభకార్యాలు, సత్సంగాలు, లలిత సహస్రనామ పారాయణ జరుగుతున్నప్పుడు, పూర్వ సువాసినులను కూడా ఒక్కొక్కప్పుడు పిలుస్తారు. పిలిచి అందరికి కుంకుమ ఇచ్చిటప్పుడు ఆ పూర్వ సువాసినిని అడగాలి "మీరు తీసుకుంటారా?" అని. కుంకుమ పెట్టుకునే హక్కు ఆవిడకి ఉంది, అమ్మవారి ప్రసాదం పెట్టుకునే హక్కు ప్రతి ఒక్కళ్లకీ ఉంటుంది. కానీ ఈవిడ్ని చూసి ఏ పులినో, సింహాన్నో చూసినట్టు ఒక్కసారి దడుచుకుని పక్కవాళ్ళ దగ్గరికెళ్ళిపోతారు. ఆవిడను చూస్తేనే పాపం అన్నప్పుడు, పిలవడం ఎందుకు? పిలిచి బాధపెట్టడం ఎందుకు?



దశ మహావిద్యలలో "ధూమావతి" అని ఒక శక్తి వుంది. ఆ ధూమావతి ఒక పూర్వ సువాసిని రూపంలో ఉంటుంది. వితంతువు అనే పదం వాడకుండా, పూర్వ సువాసిని అనే ఆవిడ కట్టుకున్న చీర మాసి, చిరిగిపోయిన తెల్ల వస్త్రం. వాహనం చూద్దామంటే కాకి. పైగా, బోర్లించిన చేట ముందుంటుంది. దానికి తోడు వికారమైన ముదుసలి ముఖం. ఏ రకంగా చూసినా కూడా మనం అనుకునే శుభలక్షణాలు ఎక్కడా కనబడవు.

కానీ, ఆ ధూమావతిని మంత్రంతో ఉపాసన చేస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి, అష్టదరిద్రాలు పోతాయి అని శాస్త్రం చెబుతున్నది. ఇప్పుడు దరిద్రం అంటే ఏమిటి? ఇంతకు ముందు వున్న ఆలోచనలు దరిద్రమా?లేక, నిజంగా మనకి ఇంట్లో తినడానికి ఏమీ లేకపోవడం - అది దరిద్రమా? భావ దారిద్ర్యమే మనల్ని పట్టి పీడిస్తోంది.

ఇదే కాదు, ఒక శుభకార్యం అయినప్పుడు, స్వంత బంధువులైనా సరే, తల్లయినా సరే, ఆ శుభ ముహూర్తంలో వేదిక మీదకి రానివ్వకుండా అడ్డుకునేవాళ్ళు చాలా మంది ఉన్నారు. అదే ఒక రాజకీయ నాయకురాలో, ఒక

సినిమా నటో వచ్చిందనుకోండి, ఆవిడ కూడా పూర్వ సువాసిని అయ్యుంటే, వాళ్ళని మాత్రం సాదరంగా, సవినయంగా ఆహ్వానించి వారిచేత అక్షింతలు వేయిస్తారే, వాళ్ళకి లేనటువంటి అమంగళం ఈవిడకి ఏమిటి? ఒక్కసారి ఆలోచించుకోవాలి.

చండీ పాఠం, పదకొండవ అధ్యాయంలో, "విద్యాస్సమస్తాస్తవ దేవి మేధా స్త్రీయస్సమస్తాస్సకలా జగత్సు, త్వయైక యా పూరితమంబ యైతత్ కాతే స్తుతిః స్తవ్య పరాపరోక్తిః."అని చెప్పబడింది. అంటే, "విద్య", "అవిద్య" అన్నీ అమ్మే. స్త్రీలందరు ఆమె స్వరూపులే. అందరూ దేవతా స్వరూపులైనప్పుడు ఈ దేవతని మాత్రం మనమెందుకు దూరంగా కూర్చోపెట్టాలి? "సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి."అని కదా అంటారు. శ్రీవిద్య రహస్యాలలో, "నువ్వుఎప్పుడైనా ఎవ్వరినైనా సరే ఏ కారణం చేతనైనా సరే దూరం చేసుకుంటే, నేను నీకు దక్కను" అని అమ్మ చెబుతున్నప్పుడు, అమ్మ అనుభవం కలగాలంటే, వీరందరిని దూరం పెట్టకూడదు.

ఇంకొక విషయం. పూర్వ సువాసిని ఎదురొచ్చిందంటే అదొక దుశ్శకునం అని అనుకుంటారు. నిజానికి జరగాల్సింది ఎప్పుడైనా జరుగుతుంది. ఉదాహరణకి, పూర్వ సువాసిని ఎదురొచ్చి, ఎక్కవలసిన విమానం తప్పిపోయింది అనుకొండి. అప్పుడు ప్రతి ఒక్కరూ, “అదుగో చూశావా! ఆవిడ ఎదురొచ్చినా నువ్వు వెళ్లిపోయేవు! అందుకే వెనక్కి తిరిగి వచ్చావు” అంటారు. ఒకవేళ ఆ విమానం ఘోర ప్రమాదానికి గురైందనుకొండి. “హమ్మయ్య! ఆవిడ ఎదురొచ్చింది కాబట్టి మనం బ్రతికి బయట పడ్డాము” అని ఎవరూ భావించరు. “ఏదో నాకు రోజు బాగుంది, అందువల్లే నేను ఈ ప్రమాదం నుండి బయట పడగలిగాను” అని మాత్రమే అనుకుంటారు. ఒక కుక్కని, ఒక పిల్లిని, ఒక పూర్వ సువాసినిని ముగ్గుర్నీ ఒకే గ్రూపులో కట్టడం ఎంత వరకు మానవత్వం?

మనం చేసుకున్న కర్మని మనం అనుభవిస్తూ ఉంటాం తప్పితే, శకునాలు అనేవి లేనే లేవు. అలాంటిది ఈ పూర్వ సువాసినిలు మాత్రం అమంగళ చిహ్నాలుగా భావిస్తే మనం ఎంత పూజ చేసినా వ్యర్ధమే. అందరు దేవతలూ కలిపి ఆ ఉపాసన చేసేవారి అవివేకాన్ని చూసి చింతిస్తారు తప్పితే అనుగ్రహించరు. దీనిలో తర్కం ఉన్నది, శాస్త్రం కాదు.

కర్ణాటకలో, భర్త పోయినాసరే మంగళ సూత్రం తీయరు, బొట్టు తీయరు, పువ్వులు తీయరు. అన్ని మామూలుగానే ఉంటాయి. మరి వాళ్ళు పాపులు అయిపోయారా? వాళ్ళకి మోక్షం రాదా? దైవం అన్నప్పుడు కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్...ఇలా వేరు వేరుగా చూస్తుందా? సోమాలియా, సౌదీ అరేబియా...అక్కడి వారు ఏది పాటించాలి? అందరికీ ఒకరే దేవత. దేవత పేర్లు, పూజించే పద్ధతి వేరుగా ఉండవచ్చు. అందరూ ఒక్కరే. ఇదంతాకూడా ఒక సంస్కృతే గాని ధర్మం, శాస్త్రం ఏమాత్రమూ కాదు. ఎవరైతే ఇలా తక్కువగా చూస్తున్నారో వాళ్ళు ఇప్పటికైనా మేలుకుని, పూర్వ సువాసినిలు అందరినీ దేవతా స్వరూపులుగా భావించాలి.

సూక్తి

**పూజ చేయటం బాధ్యత కాదు. ఆ పూజ మనకు జ్ఞానాన్ని ప్రేమను అభివృద్ధి చెందిస్తుంది.**

~ శ్రీ గురు కరుణామయ


gurUvaani

Srividya Learning Centre
#69, 6th Cross Street,
Girinagar Phase I, Bengaluru,
KA 560085, India.

srimeru999@gmail.com
+91 8088256632
www.srimeru.org